

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేద్దాం

నవంబర్ 6న మార్కాపురంలో సీఎం నిర్వహించనున్న సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కేపీ కోరారు. - 8లో..



గ్రీవెన్స్ డేలో పోలీసుల సమస్యలకు పరిష్కారం

ప్రతి శుక్రవారం పోలీసు సిబ్బందికి స్పందన నిర్వహించి వారి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37/25.7

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగ మంచు ఎక్కువగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

30న ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి జిమ్నాస్టిక్స్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి జిమ్నాస్టిక్స్ క్రీడాకారుల ఎంపికను ఈ నెల 30వ తేదీ స్థానిక గద్దలగుంటలోని ఎస్‌పీకేఆర్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.వనజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని బాలబాలికలు అండర్-14, అండర్-17 పోటీల్లో పాల్గొన వచ్చన్నారు. ఉదయం 9 గంటలకు ఈ ఎంపిక ప్రారంభమవుతుందని, పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9849429839ను సంప్రదించాలని సూచించారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టు ఎస్‌డీసీగా ప్రభాకర్

ఒంగోలు అర్బన్: కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు ల్యాండ్ ఎక్విజేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ)గా పెంచల ప్రభాకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. తాజాగా శుక్రవారం మరికొంత మందిని బదిలీ చేయగా, ఎస్‌డీసీ ఉత్తర్వులు వెలువడ్డాయి.

పులి దాడిలో గేదె మృతి



పులి దాడిలో మృతిచెందిన గేదె

అర్ధవీడు (కంభం): పెద్ద పులి దాడిలో గేదె మృతిచెందిన సంఘటన అర్ధవీడు మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో చోటుచేసుకుంది. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా మండలంలోని బొల్లుపల్లి పరిసరాల్లో పులి సంచరిస్తుందన్న సమాచారంతో ఫారెస్టు అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మండలంలోని లక్ష్మీపురం ఆంజనేయస్వామి గుడికి రెండు కిలోమీటర్ల దూరంలో పులి దాడిలో మృతిచెందిన గేదె కళేబరాన్ని ఫారెస్టు అధికారులు గుర్తించారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన కర్నాటి వెంకటేశ్వరరెడ్డి గేదెలను ఈ నెల 23వ తేదీ అడవిలో మేతకు తీసుకెళ్లగా ఒక గేదె తిరిగి రాలేదు. శుక్రవారం అడవిలో గస్తీకాస్తున్న ఫారెస్టు అధికారులు గేదె కళేబరాన్ని గుర్తించారు. మరోమారు మండలంలోని పలు గ్రామాల్లో గల అటవీ ప్రాంతంలో పులి సంచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నకిలీ పట్టాల కేసులో మరో ఇద్దరు అరెస్టు

ఒంగోలు టౌన్: నకిలీ పట్టాల కేసులో మరో ఇద్దరిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఒంగోలు నగరం భరత్‌నగర్‌కు చెందిన షేక్ అసదుల్లా, గోపాల్‌నగర్‌కు చెందిన బాపట్ల వెంకటేశ్వర్లును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది. నగరానికి చెందిన విప్పాల శ్రీనివాస్, సయ్యద్ అల్లాభ లకు స్థానిక ఎంఎస్‌ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ వెనుక, నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో స్థలాలున్నాయి. వాటిలో వారు నిర్మించిన ప్రహరీలను నిందితులు పడగొట్టి ఆక్రమించుకుని నకిలీ డీకే పట్టాలు సృష్టించారు. ఆ స్థలాల్లోకి వస్తే చంపుతామని, అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరించారు. దీంతో ఈ నెల 13న బాధితులు ఒంగోలు తాలూకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ మలికాగర్గ్ పర్యవేక్షణలోని సిట్ ఆధ్వర్యంలో ఏఎస్పీ (క్రైం) ఎస్‌వీ శ్రీధర్‌రావు, సీఐ రంగనాథ్ బృందం నిందితులను అరెస్టు చేసింది.

నేడు చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాల మూసివేత

ఒంగోలు మెట్రో: నేడు పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆలయాలు మూసివేయనున్నారు. శోభకృత నామ సంవత్సరం ఆశ్వీజ మాసం పౌర్ణమిన శనివారం రాహు గ్రస్త చంద్రగ్రహణం దేశం మొత్తం కనిపిస్తుంది. గ్రహణ స్పర్శ కాలం రాత్రి 1:04 గంటలకు మొదలవుతుంది. మధ్యకాలం రాత్రి 1:43 గంటల వరకు, మోక్షకాలం రాత్రి 2:23 గంటల వరకు, పుణ్యకాలం రాత్రి 1:19 గంటల వరకు ఉంటుంది. గ్రహణం సందర్భంగా శనివారం మధ్యాహ్నం మహా నివేదన అనంతరం దేవాలయాలను మూసివేస్తారు. తిరిగి ఆదివారం గ్రహణం అనంతరం సంప్రోక్షన చేసి అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారని ప్రముఖ పురోహితులు రామకుమార్‌శర్మ తెలిపారు.

పంట పండగ..!

ఈ ఏడాది ఖరీఫ్‌లో ముందస్తుగా సాగుచేసిన వరి పంట ప్రస్తుతం చేతికొచ్చింది. దిగుబడి పెరగడంతో పాటు మంచి ధర పలుకుతోంది. అన్నదాతకు లాభాలు కురిపిస్తోంది. జిల్లాలో ఎర్లీ ఖరీఫ్ వరి సాగు సాధారణ విస్తీర్ణం 36,565 ఎకరాలు. అందులో 20,342 ఎకరాల్లో ఎంటీయూ 1010 రకం పంటను రైతులు సాగు చేశారు. ఈ రకం పంటను బొరుగులు తయారు చేసేందుకు ఉపయోగిస్తారు. ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది.

- రైతులకు సిరులు కురిపిస్తున్న ఖరీఫ్ ముందస్తు వరి సాగు
- జిల్లాలో 20,342 ఎకరాల్లో ఎంటీయూ 1010 రకం సాగుచేసిన అన్నదాతలు
- దిగుబడి పెరగడంతో పాటు గిట్టుబాటు ధరలు
- కళ్లాల్లోనే ధాన్యం కొనుగోలు
- ఎకరాకు రూ.40 వేల వరకూ లాభాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు



ధాన్యం బస్తాలను లారీకి ఎత్తుతున్న కూలీలు



కోసిన ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న మిషన్

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో సాధారణంగా రబీ సీజన్‌లో అధిక విస్తీర్ణంలో రైతులు వరి పంట సాగు చేస్తుంటారు. ఖరీఫ్‌లో తక్కువగా సాగు చేస్తారు. అపరాల సాగు బాగా తగ్గిన నేపథ్యంలో నీటి వసతి ఉన్న మండలాల్లో ఈ ఏడాది వరి సాగుకు రైతులు ప్రాధాన్యం ఇచ్చారు. అందులో భాగంగా ఎర్లీ ఖరీఫ్‌లో సాగుచేసిన వరి పంట అధిక దిగుబడులిచ్చింది. అంతేగాకుండా అన్నదాతలు సాగుచేసిన పంట రకానికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. బొరుగులు తయారు చేసేందుకు ఈ రకం పంటను వినియోగిస్తుండటంతో గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలతో పనిలేకుండా ఏకంగా కళ్లాల వద్దరే మిల్లర్లు వెళ్లి పంట కొనుగోలు చేస్తూ మంచి ధరలు ఇస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు 5 నుంచి 10 బస్తాల వరకు పెరిగిన దిగుబడి...

జిల్లాలో ఎర్లీ ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 36,565 ఎకరాలు కాగా, 20,342 ఎకరాల్లో ఎంటీయూ-1010 రకాన్ని రైతులు సాగు చేశారు. ఎకరానికి రూ.30 వేల వరకు సాగు ఖర్చులు అయ్యాయి. సాధారణ దిగుబడి 30 నుంచి 35 బస్తాలు (క్వింటా బస్తాలు) కాగా, ఈ ఏడాది 35 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఎకరానికి సరాసరిన 40 బస్తాల చొప్పున దిగుబడి రావడంతో రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది.

రూ.300 నుంచి రూ.400 వరకూ పెరిగిన బస్తా ధర...

గతంలో క్వింటా బస్తా ధర రూ.1000 నుంచి రూ.1200 వరకు ఉండేది. ప్రస్తుతం ఆ ధర రూ.1460 నుంచి రూ.1550 వరకు పెరిగింది. సరాసరిన ఎకరాకు 40 బస్తాల చొప్పున దిగుబడి రాగా, సరాసరి ధర బస్తాకు రూ.1500 దక్కినా.. రైతుకు ఎకరానికి రూ.60 వేలకుపైగా ఆదాయం వస్తోంది. అందులో సాగు ఖర్చులు రూ.30 వేలుపోను రూ.30 వేలు మిగులుతోంది. ఇది కాక గడ్డి ద్వారా మరో రూ.10 వేలు అదనంగా మిగులుతోంది. అన్నీ కలిపి ఎకరాకు దాదాపు రూ.40 వేలకుపైగా లాభాలు వస్తుండటంతో రైతులు ఖుషీగా ఉన్నారు. పైగా, కొనుగోలు కేంద్రాలతో సైతం పనిలేకుండా మిల్లర్లే కళ్లాల వద్దకు వచ్చి గిట్టుబాటు ధరలు చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.



వరి కోత కోస్తున్న మిషన్



రోలర్‌తో కట్టలు కట్టిన వరి గడ్డి

అడుగడుగునా ప్రభుత్వ సహకారం...

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. రైతు భరోసా మొదలు.. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సకలం సమకూరుస్తూ అండగా ఉంటోంది. అందులో భాగంగానే ఈ ఏడాది ముందస్తు ఖరీఫ్‌లో వరి సాగుచేసిన రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించింది. అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలుచేసింది. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ అధిక దిగుబడులు సాధించేలా కృషి చేశారు.

ధాన్యం ధరలు బాగున్నాయి



ఖరీఫ్ సీజన్‌లో ముందస్తుగా సాగు చేసిన వరి ధాన్యానికి ప్రస్తుతం ధరలు బాగున్నాయి. మిల్లర్లే గిట్టుబాటు ధరలిస్తూ కళ్లాల్లోనే పంట కొనుగోలు చేస్తున్నారు. రైతులంతా అధిక విస్తీర్ణంలో ఎంటీయూ-1010 రకం సాగు చేశారు. నేను 8 ఎకరాల్లో సాగుచేయగా, 350 బస్తాల దిగుబడి వచ్చింది.

– నుసుం నాగార్జునరెడ్డి, రైతు, తాళ్లూరు

ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులు లేవు



సాగునీటి సమస్యలు లేకపోవడంతో వరి సాగులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. ముందస్తు ఖరీఫ్‌లో మూడు ఎకరాల్లో వరి సాగు చేశా. అధిక దిగుబడి వచ్చి గిట్టుబాటు ధరలు కూడా లభిస్తున్నాయి. బస్తా రూ.1,480 చొప్పున అమ్మాను.

– మాగంటి వెంకటరావు, రైతు, తాళ్లూరు

ఎకరానికి రూ.40 వేలకుపైగా మిగులు



ఎనిమిది ఎకరాల్లో వరి పంట సాగు చేశా. వ్యవసాయ శాఖాధికారులు ఎప్పటికప్పుడు మంచి సలహాలిస్తూ సాగు ఖర్చు తగ్గించారు. ఎకరానికి రూ.69,750 ఆదాయం వచ్చింది. ఖర్చులుపోను ఎకరాకు రూ.40 వేలకుపైగా మిగిలింది. గడ్డి ద్వారా మరో రూ.10 వేలు మిగిలింది.

– నుసుం నాగిరెడ్డి, రైతు, మాధవరం

మంచి దిగుబడులు వచ్చాయి



ఎర్లీ ఖరీఫ్‌లో సాగుచేసిన వరి దిగుబడి బాగుంది. సాధారణంగా ఖరీఫ్ దిగుబడి రబీ సీజన్ కన్నా తక్కువగా ఉంటుంది. కానీ, ఈ ఏడాది ఖరీఫ్ దిగుబడి పెరిగింది. గిట్టుబాటు ధరలు కూడా వస్తున్నాయి. ధాన్యాన్ని విక్రయించుకోవడంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదు. ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతోంది.

– ఎస్.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి, ఒంగోలు

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం

- ఇప్పటికే నిరూపించిన సీఎం
- రాజకీయాలకు అతీతంగా నవరత్నాల అమలు
- పథకాలన్నీ అందాయో..లేదో తెలుసుకునేందుకే గడపగడపకు..
- సంక్షేమాన్ని వివరించడానికే సామాజిక సాధికార యాత్ర
- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: సీఎం జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ఆ అభివృద్ధి ఏ విధంగా ఉంటుందో ఇప్పటికే ఆయన చేసి చూపించారని, మళ్లీ ఆయనే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక సచివాలయం-1 పరిధిలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సుదూర పాదయాత్రలో ప్రజల కష్టాలు స్వయంగా చూశారని, ఈ సందర్భంగా ఆయన ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పేరుతో పథకాలు అమలు చేసి నెరవేర్చారని తెలిపారు. ఆయా పథకాలన్నీ అన్ని వర్గాల పేదలను ఆదుకుంటున్నాయన్నారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకున్నారన్నారు. ఇప్పటి వరకు 98 శాతం ఆ పథకాలను ప్రజల చెంతకు చేర్చారన్నారు. ఇంకా ప్రజలకు ఏమైనా అవసరం ఉంటుందన్న ఉద్దేశంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి తమను ఇళ్లవద్దకు పంపుతున్నారని మంత్రి తెలిపారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో ప్రజలకు చేసింది చెప్పుకోవడానికి సామాజిక సాధికార యాత్ర (బస్సు యాత్ర)ను సీఎం ప్రారంభించడం జరిగిందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి లబ్ధిదారులు నీరాజనం పలుకుతున్నారని, ప్రస్తుతం చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రలో రాష్ట్ర ప్రజలు అశేషంగా పాల్గొని జగన్ నినాదాలు చేస్తున్నారని మంత్రి తెలిపారు.

దొంగ కోసం పవన్ కల్యాణ్ పాకులాట...

వందల కోట్లు కాజేసిన దొంగ చంద్రబాబు కోసం పవన్ కల్యాణ్ పాకులాడుతున్నాడని, నిజం గెలవాలంటూ చంద్రబాబు భార్య బస్సు యాత్ర చేపట్టారని, ఆయన తనయుడు ఢిల్లీలో గల్లీగల్లీ తిరుగుతున్నాడని మంత్రి సురేష్ విమర్శించారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుండటం వలనే స్కిల్ స్కాంలో రాష్ట్ర యువతకు దక్కాల్సిన కోట్లాది రూపాయలను చంద్రబాబు కాజేసిన విషయం బట్టబయలైందన్నారు. అందుకే ఆయనను రాజమండ్రి జైలుకు పంపారన్నారు. చంద్రబాబు జైలుకు వెళ్లిన తర్వాత ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ తన నిజస్వరూపం ఏమిటో బయటపెట్టాడని, టీడీపీని తన గుప్పెట్లో పెట్టుకున్న ఆయన.. బీజేపీతో మంతనాలు జరుపుతున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐ.వి.సుబ్బారావు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, తహసీల్దార్ కె.రవీంద్ర, ఎంపీడీవో వై.వి.నాగేశ్వర ప్రసాద్, పీఆర్ డీఈ బి.సుబ్బారెడ్డి, ఎంఈవో ఎం.ఆంజనేయులు, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, ఏఈలు అల్లూరయ్య, శ్రీకాంత్, ఆంజిరెడ్డి పాల్గొన్నారు.

మహిళే కీలకం



గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- జిల్లాలో మొత్తం ఓటర్లు 17,80,145
- మహిళలు 8,92,693
- పురుషులు 8,87,344,
- ఇతరులు 108
- 2024 ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
- జనవరి 5వ తేదీ తుది ఓటర్ల జాబితా విడుదల

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఓటర్ల ముసాయిదా జాబితా విడుదలైంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టర్ దినేష్‌కుమార్ తన చాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి ప్రతులు, సీడీలను వారికి అందజేశారు. జిల్లాలో మొత్తం 17,80,145 మంది ఓటర్లున్నారు. గతంతో పోల్చుకుంటే ఓటర్ల సంఖ్యలో మహిళా ఓటర్లే ఎక్కువ మంది ఉన్నారు. 50.15 శాతం మహిళలు ఉన్నారు. గతంలో కూడా మొత్తం ఓటర్లలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ప్రస్తుతం 2,183 పోలింగ్ కేంద్రాల పరిధిలో మహిళా ఓటర్లు 8,92,693 కాగా, పురుష ఓటర్లు 8,87,344, ఇతర ఓటర్లు 108 మంది ఉన్నారు. అత్యధికంగా ఒంగోలు నియోజకవర్గంలో 2,37,040 మంది ఓటర్లు ఉన్నారు. తర్వాతి స్థానాల్లో గిద్దలూరులో 2,34,515, కొండపిలో 2,33,819 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే అత్యధికంగా మహిళలు ఒంగోలు నియోజకవర్గంలో 1,22,530 మంది ఉండగా, కొండపిలో 1,18,234 మంది, గిద్దలూరులో 1,17,741 మంది ఉన్నారు. ఇక పురుష ఓటర్లు అత్యధికంగా కనిగిరి నియోజకవర్గంలో 1,17,913 మంది ఉన్నారు. తర్వాత గిద్దలూరులో 1,16,754 మంది, కొండపిలో 1,15,581 మంది ఉన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా వివరాలివీ...

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
యర్రగొండ పాలెం	1,02,134	99,036	3	2,01,173
దర్శి	1,10,450	1,08,380	11	2,18,841
సంత నూతలపాడు	1,04,071	1,07,643	6	2,11,720
ఒంగోలు	1,14472	1,22,530	38	2,37,040
కొండపి	1,15,581	1,18,234	4	2,33,819
మార్కాపురం	1,05,969	1,04,265	8	2,10,242
గిద్దలూరు	1,16,754	1,17,741	20	2,34,515
కనిగిరి	1,17,913	1,14,864	18	2,32,795
మొత్తం	8,87,344	8,92,693	108	17,80,145

ఎలక్ట్రోరల్ ప్రక్రియ ఇలా...

2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సారాలు నిండే పౌరులు ఈ నెల 27 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. నవంబర్ 4, 5 తేదీలు, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ప్రచార రోజులు నిర్వహిస్తారు. ఆయా రోజుల్లో బూత్‌లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రస్తుతం ప్రకటించిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలున్నా అదే రోజుల్లో ఫిర్యాదు చేయవచ్చు. ఆన్‌లైన్‌తో పాటు ఈఆర్‌ఓ, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, బీఎల్‌ఓ కార్యాలయంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా నేషనల్ ఓటర్స్ సర్వీస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950ను సంప్రదించవచ్చు. వచ్చే ఏడాది జనవరి 5న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తారు.

క్షేత్ర స్థాయికి జిల్లా యంత్రాంగం

- సమస్యల పరిష్కారమే ధ్యేయం
- త్రిపురాంతకంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్



సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

త్రిపురాంతకం: స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా అధికారులంతా మండల కేంద్రాలకు వచ్చి స్థానిక అధికారులతో కలిసి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. త్రిపురాంతకంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం పేరుతో మండల స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తెలియజేసేందుకు జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి రాలేని వారి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండల స్థాయిలో కలెక్టర్, జిల్లా అధికారులతో స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించినట్లు వివరించారు. ఆ మేరకు ప్రతి మండలంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులంతా పాల్గొనడంతో పాటు స్థానిక అధికారులతో కలిసి అక్కడికక్కడే అధిక శాతం సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

సమస్యలపై 220 అర్జీలు...

త్రిపురాంతకం మండల ప్రజలు దాదాపు 220 మంది సమస్యలపై అర్జీలు అందజేసినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడించారు. వాటిలో ఎక్కువగా భూ సమస్యలు, అసైన్‌మెంట్ సమస్యలు ఉన్నాయన్నారు. తాగునీటి కోసం గ్రామాల నుంచి అర్జీలు అందాయన్నారు. 2020 నుంచి 2023 వరకు తాగునీటి సమస్య లేకుండా నీరందించేందుకు వినియోగించిన ట్యాంకర్ యజమానులకు బిల్లులు అందించేందుకు ప్రభుత్వం రూ.130 కోట్లు మంజూరు చేసిందని, త్వరలో వారికి రావాల్సిన బకాయిలు అందుతాయని తెలిపారు. నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా పైపులైన్లు వేస్తామన్నారు. రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. సమస్యలన్నింటిపై అధికారులతో చర్చించి పరిష్కరించాలని ఆదేశించామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, జెడ్పీ సీఈఓ బాలిరెడ్డి, తహసీల్దార్ వి.కిరణ్, డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంపీడీఓ సాంబశివరావు, ఈఓఆర్డీ మురళీమోహన్, జిల్లా, మండల, సచివాలయ స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు 31 వరకు అవకాశం

ఒంగోలు: ఏపీ ఓపెన్ స్కూల్లో పది, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాన్యవర్గాలకు సార్వత్రిక విద్యాపీఠం ఒక వరమని అన్నారు. ఉన్నత విద్య చదువుకునే ఆశ ఉండి అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో సగంలో బడి మానేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు. వివాహమైనవారు కూడా చదువుకునే అవకాశం ఓపెన్ స్కూల్ ద్వారా ఉందన్నారు. వారి రోజువారీ కార్యక్రమాలకు ఎలాంటి విఘాతం లేకుండా ఈ చదువు కొనసాగించవచ్చని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులకు ఫీజులో రాయితీ ఉందని వివరించారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా చదువుకునేవారికి రెగ్యులర్ పది, ఇంటర్ మాదిరిగానే అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అర్హత ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలను సంప్రదించాలని కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి సూచించారు.

క్లుప్తంగా

ముఖ్యమంత్రిని కలిసిన డాక్టర్ యాదాల


సీం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో డాక్టర్ యాదాల అశోక్‌బాబు, కుటుంబసభ్యులు

ఒంగోలు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి డాక్టర్ యాదాల అశోక్ బాబు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అశోక్‌బాబు సతీమణి నాగులుప్పలపాడు జెడ్పీటీసీ డాక్టర్ రత్నకుమారి, కుటుంబసభ్యులతో కలిసి మాట్లాడారు.

మంటల్లో కారు దగ్ధం


మంటల్లో దగ్ధమవుతున్న కారు

దొనకొండ: మండలంలోని నరసింహనాయుని పాలెంకు చెందిన గుడిమెట్ల కోటయ్యకు చెందిన కారు శుక్రవారం అగ్నికి ఆహుతైంది. వివరాల్లోకి వెళితే.. కోటయ్యకు చెందిన కారు మరమ్మతులకు గురి కావటంతో స్థానిక మెకానిక్ వద్ద వారం రోజుల క్రితం ఉంచారు. కారు పైభాగాన అనుకోకుండా గుర్తు తెలియని వ్యక్తులు మంట వేయడంతో గాలివీచి కారు టైర్లకు అంటుకున్నాయి. కారు పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

మగ్గంవర్క్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

ఒంగోలు టౌన్: మగ్గంవర్క్‌లో గ్రామీణప్రాంత మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ పి.ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామీణ మహిళలకు నవంబర్ 8 నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు లోపు మహిళలు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు వివరాలతో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. శిక్షణా కాలంలో ఉచితంగా భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.వివరాలకు 9492583484 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎంపికైన అభ్యర్థులు స్కిల్ టెస్టుకు హాజరుకావాలి

ఒంగోలు: సమగ్రశిక్షలో కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం స్కిల్ టెస్టుకు అర్హులుగా పేర్కొన్న వారి జాబితా డీఈఓ.ప్రకాశం.కో.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచామని, అభ్యర్థులు వారికి నిర్ణయించిన తేదీల్లో స్కిల్ టెస్టుకు హాజరుకావాలని డీఈఓ వీఎస్ సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31న ఎంఆర్ కేటగిరీ అభ్యర్థులు, నవంబరు 1న హెచ్ఐ/వీఐ కేటగిరీ వారు స్థానిక సెయింట్ థెరెస్సా ఉన్నత పాఠశాలలో జరిగే స్కిల్ టెస్టుకు హాజరుకావాలన్నారు. ఉదయం 10గంటలకు హాజరయ్యే సమయంలో విద్యార్హతలు, ఆర్‌సీఐ రెన్యువల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ నకలు కాపీలతోపాటు ఒరిజినల్స్‌తో స్కిల్ టెస్టుకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులకు టెక్ట్స్ మెసేజ్, ఫోన్ కాల్ ద్వారా కూడా స్కిల్ టెస్టు తేదీలు ఇప్పటికే తెలియజేసినట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

గుడ్లూరు: బైక్ అదుపు తప్పి ఫెన్సింగ్ రాళ్లను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై యువకుడు మృతి చెందాడు. మండలంలోని చెంచిరెడ్డిపాలెం గ్రామం వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. వెంకంపేట గ్రామానికి చెందిన జయంపు తిరుమలరావు (21) బైక్‌పై శుక్రవారం సాయంత్రం గుడ్లూరుకు వచ్చి తిరిగి వెంకంపేట వెళ్తుండగా చెంచిరెడ్డిపాలెం గ్రామం వద్ద అదుపు తప్పి పక్కనే పొలాల్లో ఉన్న ఫెన్సింగ్ రాళ్లను ఢీకొట్టింది. దీంతో కిందపడిన తిరుమలరావుకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో కావలి వైద్యశాలకు తరలించగా అక్కడ మృతి చెందాడు.

సామాజిక సాధికార యాత్రను
విజయవంతం చేద్దాం

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి: మార్కాపురం నియోజకవర్గంలో నవంబర్ 6వ తేదీన జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వివేకానంద కళాశాలలో శుక్రవారం వైఎస్సార్ సీపీ కొనకనమిట్ల మండల కార్యకర్తల, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రానికి మేలు చేశారన్నారు. ఆ మేలును ప్రజలకు చెప్పుకునే సమయం వచ్చిందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజకీయ రంగంలో ఎంతో ప్రాధాన్యం ఇచ్చి జగన్‌మోహనరెడ్డి ప్రోత్సహిస్తున్నారన్నారు. మార్కాపురంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నవంబర్ 9వ తేదీన ఏపీ వై నీడ్స్ జగన్ కార్యక్రమం ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మండలస్థాయి నాయకులు పర్యవేక్షిస్తారని తెలిపారు. గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, ముఖ్య కార్యకర్తలంతా సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. పార్టీ సమావేశం, జెండా ఆవిష్కరణ, గడప గడపకు తిరిగి పార్టీ సంక్షేమ పథకాల ప్రచారం చేయాల్సి ఉంటుందన్నారు. గృహాలపై జెండావిష్కరణ, ప్రజల అభిప్రాయాలను నమోదు చేయాలన్నారు. నవంబర్‌లలో ప్రధానంగా ఈ రెండు కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, ముఖ్య నాయకులు ముందుండాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళి, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, పార్టీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సచివాలయం మండల కన్వీనర్ సూరవరపు పెద్ద వెంకటరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డేలో
పోలీసుల సమస్యలకు పరిష్కారం

● ఎస్పీ మలికాగర్గ్


సిబ్బంది నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీసు సంక్షేమ దివస్ (గ్రీవెన్స్‌డే)లో పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించనున్నట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో ఆమె జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పోలీసు సిబ్బంది నుంచి అర్జీలు స్వీకరించారు. సిబ్బందితో నేరుగా మాట్లాడిన ఎస్పీ ఆయా సమస్యలను చట్టపరంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విధుల్లో సిబ్బంది చురుగ్గా వ్యవహరించేలా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ప్రజలకు మరింత మెరుగ్గా సేవలు అందించాలని పోలీసులకు సూచించారు. డీపీఓ ఏఓ ఎం సులోచన, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్, ఆర్ఐ శ్రీహరిరెడ్డి, హరిబాబు, స్పందన ఎస్సై సుదర్శన్ పాల్గొన్నారు.

చిన్నారి ఊపిరితిత్తిలో శనగపప్పు

● అర్ధరాత్రి బ్రాంకోస్కోపీ చేసి ప్రాణాలు రక్షించిన ఒంగోలు అరవింద వైద్యులు



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ నరేంద్ర

ఒంగోలు టౌన్: పొరపాటున శనగపప్పు తిన్న ఒక చిన్నారికి అత్యవసర వైద్య చికిత్స చేసిన ఒంగోలు వైద్యులు ప్రాణాలను కాపాడారు. వివరాలు..బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన జి. వెంకటసుబ్బారావు, శ్రావణి దంపతుల కుమారుడు జశ్వంత్‌కు 13 నెలలు. రెండురోజుల క్రితం జశ్వంత్ పొరపాటున శనగపప్పు మింగేశాడు. చిన్నపిల్లాడు కావడంతో ఆ పప్పును సరిగా మింగలేకపోవడంతో అది జీర్ణవ్యవస్థలోకి పోకుండా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి ఇరుక్కుంది. తలిదండ్రులు ఇది గమనించలేదు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఊపిరి ఆడక ఇబ్బంది పడుతుంటే ఆందోళన చెందిన తల్లిదండ్రులు బాలుడిని అద్దంకిలోని ఒక చిన్నపిల్లల వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చూపించారు. ఊపిరితిత్తుల్లో ఏదో సమస్య గుర్తించిన సదరు వైద్యుడు వెంటనే వారిని ఒంగోలులోని అరవింద్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. బాలుడికి అవసరమైన వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టర్ ఎస్.భానుతేజ, డాక్టర్ ఎం.నరేంద్ర బృందం అత్యవసరంగా బ్రాంకోస్కోపీ చేసి ప్రాణాలను కాపాడారు. ఈ సందర్భంగా డాక్టర్ భానుతేజ మాట్లాడుతూ 13 నెలల చిన్నారికి బ్రాంకోస్కోపీ చేయడం చాలా అరుదని తెలిపారు. మత్తు మందు ఇచ్చి స్కోపీ చేయాల్సి వచ్చిందని, ఇది చాలా రిస్క్‌తో కూడుందని పేర్కొన్నారు.

శ్రీలక్ష్మికి కలెక్టర్ అభినందన


శ్రీలక్ష్మిని అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సింగరాయకొండ సంక్షేమ విద్యా సహాయకురాలు కె.శ్రీలక్ష్మి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌లో రాష్ట్రం తరుపున కబడ్డీ పోటీల్లో పాల్గొని బ్రాంజ్‌మెడల్ సాధించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రకాశం భవనంలో ఆమెను అభినందించారు. సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విజయకృష్ణన్ ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మిని అభినందించారు. భవిష్యత్‌లో క్రీడల్లో మరింత రాణించి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, ఇతర అధికారులు మధుసూధన్‌రెడ్డి, రాజేష్, అంకబాబు, మనోహర్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన


క్యూ ఆర్ కోడ్ ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

త్రిపురాంతకం: కలెక్టర్ దినేష్‌కుమార్ మండలంలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. తొలుత మండలంలోని మిట్టపాలెంలో జరుగుతున్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించి ప్రజలతో వైద్యులతో మాట్లాడారు. వైద్య పరీక్షలు జరుగుతున్న తీరుపై ప్రజలను ప్రశ్నించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేసారు. ఈయన వెంట తహసీల్దార్ వి.కిరణ్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల ప్రమాణాలు పెంచేందుకు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఈఓలు కె.తులసి మల్లికార్జున నాయక్, టి.రాజశేఖరరెడ్డి ఉన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో నగదు రహిత లావాదేవీలకు అవసరమైన క్యూ ఆర్ కోడ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. గ్రామసర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, సబ్ కలెక్టర్ సేతుమాదవన్, జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి, ఈఓపీఆర్‌డీ మురళీమోహన్ తదితరులు ఉన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి

ఒంగోలు టౌన్: జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్, ఏసీడీ ప్రోగ్రాంలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సులు, ఫిజియోథెరపిస్ట్, మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లో ఉంచినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిన నియమించే ఈ ఉద్యోగాలకు సెప్టెంబర్ 20 నుంచి 29 వరకు స్వీకరించినట్లు తెలిపారు. ఈ జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో సహా ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు జిల్లా వైద్యారోగ్య శాఖలో ఫిర్యాదులను అందజేసి అందుకు తగిన రశీదును తీసుకోవాలని కోరారు. గడువు తరువాత ఎటువంటి అభ్యంతరాలను స్వీకరించేది లేదన్నారు.

హాకీలో మైనంపాడు
క్రీడాకారులకు గోల్డ్ మెడల్


క్రీడాకారులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలుకు చెందిన పలువురు క్రీడాకారులు హాకీ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించినట్లు పీఈటీ రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు చెన్నైలో నిర్వహించిన సౌత్‌జోన్ నేషనల్ సబ్ జూనియర్ మహిళల విభాగం పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన టీమ్‌లో మైనంపాడుకు చెందిన ఆకుల భవ్యశ్రీ, ఎస్కే కామ్రూన్ ఉన్నారు. బాలుర విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ జట్టులో మైనంపాడుకు చెందిన తన్నీరు రోహిత్ ఉన్నారు. ప్రతిభ ప్రదర్శించిన క్రీడాకారులను మైనంపాడులోని ప్రభుత్వ హైస్కూలు హెచ్ఎం, డైట్ కాలేజీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు సత్కరించి అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

● పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు


మొక్కలు పంపిణీ చేస్తున్న ఆర్ఎం లక్ష్మణరావు

ఒంగోలు సెంట్రల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు అన్నారు. స్వచ్ఛత అభియాన్-3లో భాగంగా శుక్రవారం పొగాకుబోర్డు ప్రాంతీయ కార్యాలయంలో రైతులు, బోర్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం లక్ష్మణరావు మాట్లాడుతూ పచ్చదనం పెంపకంతో పర్యావరణ సమతుల్యత సాధ్యమని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించి ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు విరివిగా నాటాలని సూచించారు. బోర్డు ఆవరణలో మొక్కలు నాటారు. రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. వేలం నిర్వాహణాధికారులు ఎం రవికాంత్, సత్య శ్రీనివాస్, తులసి, బోర్డు మెంబర్లు వర ప్రసాదరావు, బ్రహ్మయ్య, శేషయ్య, నరసింహం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు బస్టాండ్ సమీపంలో ఒంగోలు-నంద్యాల హైవేరోడ్డుపై ఈ నెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెంచికలపాడుకు చెందిన కందుల రమణారెడ్డి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పూసలపాడు బస్టాండ్ వద్ద హైవేరోడ్డుపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన ఐరన్ డ్రమ్ములను మోటార్‌సైకిల్ ఢీకొని రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

లాభాల బాటలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

● పీడీసీసీ బ్యాంకు చైర్మన్ ప్రసాద్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు గడిచిన ఆర్థిక సంవత్సరానికి లాభాల బాటలో నడిచిందని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఒంగోలులోని బ్యాంకు కార్యాలయంలో శుక్రవారం పాలకవర్గ సభ్యులు, అధికారులు, పీఏసీఎస్ అధ్యక్షులతో 68వ మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా విదేశీవిద్య, వ్యవసాయ రంగ రైతులకు రుణాలు ఇచ్చేందుకు తీర్మానించారు. కమర్షియల్ బ్యాంకు లాగానే కారు, ద్విచక్రవాహనాలు, హౌసింగ్ రుణాలు, పాల వెల్లువ తదితర స్కీముల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. భారతి పేరుతో బయట బ్యాంకులు కంటే ఒక్క శాతం ఎక్కువ వడ్డీని అందిస్తూ డిపాజిట్ స్కీమును ప్రవేశపెట్టామని, మధుపరులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఉద్యోగుల ప్రమోషన్లు, నూతనంగా ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ చేసుకునేది కూడా తీర్మానించామన్నారు. బ్యాంకు సీఈఓ వై.ప్రకాష్, ప్రొఫెషనల్ డైరెక్టర్ వరప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్స్ సయ్యద్ నూర్ అహ్మద్, బొడ్డు జయరామిరెడ్డి, అప్కాబ్ డీజీఎం ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు
రుణాలు ఇవ్వడం అభినందనీయం

● ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి


మాట్లాడుతున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు సిటీ: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా విదేశీ విద్య, వ్యవసాయ రైతులకు రుణాలు అందించడం అభినందనీయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఒంగోలులోని బ్యాంకు కార్యాలయంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డిని మాగుంట శ్రీనివాసులురెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ బ్యాంకును అభివృద్ధి బాటలోకి తీసుకువచ్చేందుకు పాలకవర్గం కృషిని అభినందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకార వ్యవస్థను బలోపేతం చేసి రైతులను ఆదుకునేందుకు తీసుకున్న నిర్ణయంతో వారి కల సాకారం అవుతుందన్నారు. బ్యాంకు అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. భారతి డిపాజిట్ స్కీమ్స్‌లో మదుపర్లు భాగస్వాములు కావాలని కోరారు. సీఈఓ ప్రకాష్, వరప్రసాద్‌రెడ్డి, సంఘ అధ్యక్షులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.